## క్లుప్తంగా

### 14న లోక్ అదాలత్



మాట్లాడుతున్న జడ్జి మాధురి

కాశీబుగ్గ: పలాస జూనియర్ సివిల్ కోర్టులో డిసెంబర్ 14వ తేదీన నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి కోరారు. పలాస కోర్టు ఆవరణలో పోలీసు ఉన్నతాధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాజీకి అవకాశం ఉన్న అన్ని కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు, రూరల్ సీఐ టి.తిరుపతి, పట్టణ సీఐ డి.మోహన్‌రావు, వజ్రపుకొత్తూరు ఎస్ఐ నిహార్, సీసీ నారాయణ ఉన్నారు.

### ఎస్పీ గ్రీవెన్స్‌కు 20 వినతులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

కాశీబుగ్గ: కాశీబుగ్గ డీఎస్పీ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 20 వినతులను స్వీకరించారు. వినతులను పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత విభాగాల సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు.

### ఎయిడ్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న వక్తలు

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సును వైబీసీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. వైద్యఆరోగ్యశాఖ, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు నిర్వహించిన సదస్సులో వక్తలు మాట్లాడుతూ.. ఎయిడ్స్ రోగులపై చిన్నచూపుతగదన్నారు. డిసెంబర్ ఒకటో తేదీన ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రాజెక్టు మేనేజర్ ఎం.మాధవరావు, ప్రిన్సిపాల్ ఎం.హుస్నెల్లా, హెల్త్ ఎడ్యుకేటర్, పీఈటీలు పాల్గొన్నారు.

### శతశాతం ఉత్తీర్ణత సాధించాలి


- డీవీఈవో తవిటినాయుడు



విద్యార్థులతో మాట్లాడుతున్న తవిటినాయుడు

కంచిలి: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని డీవీఈవో తవిటినాయుడు అన్నారు. కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంకల్పం కార్యక్రమంలో భాగంగా అధ్యాపక సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించి తగు సూచనలిచ్చారు. సమయపాలన పాలించాలని, స్టడీ హవర్స్ నిర్వహించాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్ ఉన్నారు.

### అపార్ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంఈవో జొరాడు

సోంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో అపార్ సమస్యలు పరిష్కరించి ప్రగతి సాధించాలని మండల విద్యాశాఖాధికారి ఎస్.జొరాడు ప్రధానోపాధ్యాయులకు సూచించారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో మండలం పరిధిలోని ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. విద్యాశాఖకు సంబంధించి అన్ని యాప్‌లపై ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2 మార్కుల నమోదు పూర్తి చేయాలన్నారు. వచ్చేనెల ఏడో తేదీన పాఠశాలల్లో నిర్వహించే తల్లిదండ్రుల మెగా సమావేశానికి చేయవలసి కార్యక్రమాలు గురించి అవగాహన కల్పించారు.

### ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ సభలను జయప్రదం చేయండి

కంచిలి: భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) 22వ జాతీయ మహాసభలు డిసెంబర్ ఆరు నుంచి తొమ్మిదో తేదీ వరకు ఢిల్లీలో జరగనున్నాయి. వీటిని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జిల్లా కార్యదర్శి పుక్కళ్ల అరేలమ్మ కోరారు. ఈ మేరకు కంచిలి మండల పరిధిలో సంబంధిత కరపత్రాలను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఇచ్ఛాపురం నియోజకవర్గం ఇన్‌చార్జి సాలిన నారాయణస్వామి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## సృజన విరిసేలా.. భవిత మురిసేలా!

- నాడు-నేడుతో రూపుమారిన డొంకూరు పాఠశాల
- సౌకర్యాలతో పెరిగిన విద్యార్థుల చేరికలు

ఇచ్ఛాపురం రూరల్:

సముద్ర తీరం చెంత ఒకప్పుడు తుఫాన్ రక్షిత భవనంలో చదువుకునే విద్యార్థులు ఇప్పుడు అన్ని సౌకర్యాలు ఉండే సర్కారు బడిలో విద్యనభ్యసిస్తున్నారు. తల్లిదండ్రులు చేపల వేటకు వెళ్లితే బడికి రాకుండా ఇంటి పట్టునే ఉండే చిన్నారులు ఇప్పుడు ఇంగ్లిష్‌లో మాట్లాడుతున్నారు. ఒకప్పుడు వంద మంది పిల్లలు కూడా లేని ఈ పాఠశాలలో ఇప్పుడు 200 వందల మంది అభ్యసిస్తున్నారంటే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకంలో సర్కారు బడుల రూపు రేఖలు మార్చడం వల్లనే అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్ఛాపురం మండలం డొంకూరు ప్రాథమిక పాఠశాలలో ఇప్పుడు 214 మంది విద్యార్థులు చదువుతున్నారు. తొమ్మిది మంది ఉపాధ్యాయులు ఉండే ఈ పాఠశాలలో గతంలో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించేవారు. మొదటి విడతలో మనబడి నాడు-నేడు పథకం ద్వారా రూ.18 లక్షలతో ఈ పాఠశాలను కార్పొరేట్ స్థాయికి తీసుకువెళ్లారు. పాఠశాల చుట్టూ ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణం, మంచినీరు శుద్ధ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. అంతే కాకుండా ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఇంగ్లిష్ మాధ్యంలో బోధిస్తుండటంతో ఈ బడిలో తమ పిల్లల్ని చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపించారు.



టీవీ ద్వారా విద్యా బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు



అక్షరమాల గౌనుతో తెలుగు హల్లులను పరిచయం చేస్తున్న ఉపాధ్యాయిని

**ఉపాధ్యాయుల సృజనాత్మక బోధన**

బడిలో ఉన్న నాలుగు స్మార్ట్ టీవీల ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థులకు సృజనాత్మక బోధన చేస్తున్నారు. ఉపాధ్యాయులే స్వయంగా తయారు చేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం) ద్వారా ఒకటి, రెండు తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ అక్షరాలు, పదాలు పరిచయం చేస్తున్నారు. తరగతి వారీగా విద్యార్థులకు ప్రతాభా పరీక్షలు నిర్వహించి విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలతో సత్కరించడం ఈ పాఠశాల ప్రత్యేకత. తరగతి గోడలపై కుడ్య చిత్రాల సహాయంతో విద్యా బోధన చేస్తున్న ఉపాధ్యాయుల కృషిని విద్యార్థుల తల్లిదండ్రులు అభినందిస్తున్నారు.



టీఎల్ఎంతో పదాలను పలుకుతున్న చిన్నారి

### నాడు-నేడు పుణ్యమాని..



మా పాఠశాలలో 200 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారంటే అందుకు సహోపాధ్యాయుల కృషి ఎంతో ఉంది. సృజనాత్మక బోధనతో విద్యార్థులను ఆకట్టుకుంటున్నారు. నాడు-నేడు పథకం పుణ్యమాని పాఠశాలలో అన్ని మౌలిక సదుపాయాలు సమకూరాయి. దీంతో ప్రైవేటు పాఠశాలల్లో చదివే పిల్లల్ని సైతం వారి తల్లిదండ్రులు మా బడిలో చేర్పిస్తున్నారు.

– కోట్ని సాయిరామ్, ప్రధానోపాధ్యాయులు

### కలలో కూడా నమ్మలేక పోతున్నాం



మాది మత్స్యకార గ్రామం కావడంతో కుటుంబ పెద్దలు చేపల వేటకు వెళ్లిపోతే... పిల్లలు ఇంటి వద్దనే ఉండేవారు. దీంతో చాలా మంది బడి ముఖం చూడని పరిస్థితి. ఒకప్పుడు తుఫాన్ షెల్టర్‌లో చదువులు సాగేవి. ఇప్పుడు మా ఊరు స్కూల్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ఇంగ్లిష్ చదువులు, టీవీల ద్వారా బోధన చేస్తున్న ఉపాధ్యాయులను చూస్తుంటే కలలో కూడా నమ్మలేకపోతున్నాము ఇది మా స్కూలేనా అని.

– బడే కళావతి, చైర్మన్, పేరేంట్స్ కమిటీ

### నారు..అమ్మకం జోరు..



శీతాకాల సమయంలో వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పూల మొక్కలను రైతులు పొలాల్లో, ఔత్సాహికులు ఇళ్ల వద్ద సాగు చేస్తుంటారు. వీటికి కావాల్సిన నారును వేరే వారి నుంచి కొనుగోలు చేస్తుంటారు. ప్రస్తుతం కాశీబుగ్గ పట్టణంలో ఉద్దాన ప్రాంతానికి చెందిన మహిళా రైతులు వివిధ రకాల నారును రోడ్డు పక్కన ఉంచి విక్రయిస్తున్నారు. వీటిని చాలామంది జోరుగా కొనుగోలు చేసి పొలాలు, ఇళ్ల వద్ద నాటి సాగు చేస్తున్నారు. –కాశీబుగ్గ

### మురుగు నీటితో ఇక్కట్లు..



తుఫాన్ ప్రభావంతో శుక్రవారం టెక్కలిలో తేలిక పాటి వర్షం కురిసింది. దీంతో సమీపంలోని కాలువల నుంచి వచ్చిన మురుగునీరు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోకి చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. మురుగునీటిలో నుంచి వెళ్లే బస్సులను ఎక్కారు. అధికారులు స్పందించి కాలువల్లో పూడికలు తీయాలని, కాంప్లెక్స్ ఆవరణలో నెలకున్న సమస్యను పరిష్కరించాలని కోరారు. –టెక్కలి రూరల్

### పేదలకు దుప్పట్లు పంపిణీ



చలితీవ్రత పెరుగుతుండడంతో పేదలకు అండగా నిలవాలని కవిటికి చెందిన హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు నిర్ణయించారు. ఇందులో భాగంగా మండలంలోని జాడుపుడి ఆర్ఎస్ నుంచి ఇచ్ఛాపురం వరకు జాతీయ రహదారికి ఇరువైపుల ఉన్న 50 మంది యాచకులు, అనాథలకు దుప్పట్లు, లుంగీలు, టవళ్లను శుక్రవారం పంపిణీ చేసి ఔదర్యాన్ని చాటుకున్నారు. -కవిటి

### చలి నుంచి రక్షణకు..



వాతావరణం మారడంతో రెండు రోజులుగా చల్లని గాలులు వీస్తున్నాయి. దీంతో ప్రజలు చలితో వణికిపోతున్నారు. ప్రధానంగా వృద్ధులు, బాలింతలు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. చలి తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు అగ్గి మంటలను ఆశ్రయిస్తున్నారు. శుక్రవారం చాలా మంది మంట కాగుతూ కనిపించారు.

–వజ్రపుకొత్తూరు రూరల్

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

పలాస: ధాన్యం కొనుగో కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. లక్ష్మీపురం గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫెంగల్ తుఫాన్ నేపథ్యంలో రైతులకు ఇబ్బంది లేకుండా పలాస మండలంలో 12 చోట్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్టు పేర్కొన్నారు. లక్ష్మీపురం గ్రామంలో పాటు టెక్కలి పట్నం, బంటుకొత్తూరు, కేదారిపురం, అల్లుకోల, లొద్దబద్ర, కాశీబుగ్గ పూజారి వీధి, బొడ్డపాడు తదితర గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద వీటిని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పలాస తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి, మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ క్రిష్ణమూర్తినాయుడు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ ఉన్నారు.



ధాన్యం కొనుగోలు కేందాన్ని పరిశీలిస్తున్న బాబూరావు

## ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

సోంపేట: రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని తహసీల్దార్ బి.అప్పలస్వామి కొనుగోలు కేంద్రాల సిబ్బందికి సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తితో కలిసి ధాన్యం కొనుగోలు సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మండలంలో 24 రైతు సేవ కేంద్రాలను కొనుగోలు కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. వీటిని పది క్లస్టర్లుగా విభజించామన్నారు. 18,268 టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పౌర సరఫరాలశాఖ డీటీ పూడి కూర్మారావు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు బి.నారాయణరావు, రాజేష్ పాల్గొన్నారు.

**సమన్వయంతో ధాన్యం సేకరణ**

కంచిలి: ఖరీఫ్‌లో రైతులు సాగుచేసిన ధాన్యాన్ని సిబ్బంది సమన్వయంతో సేకరించాలని కంచిలి తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ మేరకు వ్యవసాయ, రెవెన్యూశాఖ, రైస్‌మిల్లు యజమానులతో సమన్వయ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో ముందుగా రైస్ మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయడానికి అవసరమైన బ్యాంకు గ్యారంటీలను మండలంలో ధాన్యం సేకరించేందుకు గుర్తింపు పొందిన ఆరుగురు మిల్లరు ఇంతవరకు కొందరు సమర్పించలేదని, వెంటనే వాటిని సమర్పించాలన్నారు. ఇక ధాన్యం సేకరణలో కీలకంగా వ్యవహించే వ్యవసాయశాఖ సహాయ అధికారులు రైతులు కోరుకున్న మిల్లుకు ధాన్యం విక్రయించేందుకు అవసరమైన ప్రక్రియను చేపట్టాలని మండల వ్యవసాయాధికారి బి.ధనుంజయ సూచించారు. ఎంపీడీవో వి.తిరుమలరావు ఉన్నారు.



సోంపేట: సమావేశంలో తహసీల్దార్ అప్పలస్వామి తదితరులు





కంచిలి: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్‌కుమార్

## గిరిజన గ్రామాల్లో చేప పిల్లలు పంపిణీ

టెక్కలి/నందిగాం: సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో శుక్రవారం టెక్కలి, నందిగాం మండలాల్లో పలు గిరిజన గ్రామాల్లో రాయితీపై చేప పిల్లల్ని పంపిణీ చేశారు. డమర, జి.జగన్నాథపురం, లంకపాడు, పాలసింగి, నరహరిపురం, పాత్రపురం, బైరిబొడ్డపాడు, సొంటినూరు తదితర గ్రామాల్లో గిరిజనులకు చేప పిల్లల్ని పంపిణీ చేసి చెరువుల్లో విడిచిపెట్టారు. ఐటీడీఏ ప్రత్యేకాధికారి వి.శ్రీనివాసరావు, ఎఫ్‌డీఓ ధర్మరాజు పాత్రో, సహాయకుడు బి.మధుసూదన్‌రావు, సాగరమిత్ర క్రాంతి సభ్యులు పాల్గొన్నారు.



టెక్కలి: నరహరిపురంలోని చెరువులో చేప పిల్లల్ని విడిచి పెడుతున్న దృశ్యం

### 7న తల్లిదండ్రులతో సమావేశం

కంచిలి: వచ్చేనెల ఏడో తేదీన విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలను ఏర్పాటు చేయాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ వి.జయరాజ్ అన్నారు. మకరాంపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. అన్ని పాఠశాలల్లో ఒకే రోజున సమావేశాలను నిర్వహించాలని సూచించారు. ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నదాత ఆందోళన!

- వరి పంటను కాపాడుకునే పనిలో బిజీ

సోంపేట/వజ్రపుకొత్తూరు/ఇచ్ఛాపురం రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్‌తో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకుంది. ఆరుగాలం శ్రమించి..పండించిన వరిచేను చేతికి వచ్చేసమయంలో తుఫాన్ సంభవించడంతో నష్టపోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు. దీంతో కోసిన వరిచేనును కుప్పలుగా వేసి పనిలో శుక్రవారం రైతులు నిమగ్నమయ్యారు. అలాగే నూర్పు చేసిన ధాన్యాన్ని టార్పాలిన్లతో కప్పి తడవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే మధ్యాహ్నం నుంచి చిరుజల్లులు పడడంతో వీరి ఆందోళన మరింత ఎక్కువైంది. కాగా వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తుఫాన్ తీరం దాటి..వర్షాలు తగ్గేవరకూ వరికోతలు చేయవద్దని సూచించారు. కాగా సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో మత్స్యకారులు వలలు, బోట్లను సురక్ష ప్రాంతాలకు తరలించారు.



ఇచ్ఛాపురం రూరల్: పంట పొలాల్లో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరావు, ఏవో భార్గవి



ఇచ్ఛాపురం రూరల్: కోత కోసిన పంటను రక్షించుకుంటున్న రైతులు



సోంపేట: పలాసపురంలో వరికుప్పలు వేస్తున్న రైతులు



వజ్రపుకొత్తూరు: లింగాలపాడులో వరి చేను కుప్పలకు టార్పాలిన్లు కప్పుతున్న రైతులు

### పిల్లలకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

టెక్కలి: టెక్కలిలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి (ఎఫ్ఏసీ) జె.శ్రీనివాసరావు పర్యవేక్షణలో వైద్యులు ఎం.వాసు కిరణ్, ఇంద్రజ ఆధ్వర్యంలో చెవి, ముక్కు, గొంతు తదితర భాగాలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. భవిత కేంద్రం ఐఈఆర్‌టీ మన్మథరావు ఉన్నారు.

## క్రీడా మైదానం పరిశీలన

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలోని శ్రీసురంగి రాజా క్రీడా మైదానాన్ని రూ. రెండు కోట్లతో ఇండోర్ స్టేడియంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్టు స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. దానికి తగ్గట్టుగా ప్రతిపాదనలు కూడా సిద్ధం చేస్తున్నామన్నారు. క్రీడా మైదానాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. మైదానం విస్తీర్ణం ఎంత ఉందో సర్వే నిర్వహించి పూర్తి వివరాలు తీసుకురావాలన్నారు. ఇండోర్ స్టేడియంతో పాటు 400 మీటర్ల రన్నింగ్, వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపడతామని చెప్పారు. క్రీడాకారులకు అవసరమైన పరికరాలు ఏర్పాటుచేసి క్రీడల అభివృద్ధికి చర్యలు చేపడతామని చెప్పారు. ఈ సందర్భంగా సీనియర్ క్రీడాకారులు, స్థానికులు మైదానం ఆక్రమణకు గురైనట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మైదానాన్ని సర్వే చేయించి ఆక్రమణలుంటే వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్‌లను ఆదేశించారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు, టీడీపీ నాయకులు కె.శంకర్‌రెడ్డి, జాని ఉన్నారు.



మైదానం సర్వేపై అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

### నేడు మత్తు పదార్థాలపై అవగాహన ర్యాలీ

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో శనివారం మత్తుపదార్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఉదయం పది గంటలకు పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ప్రారంభం కానున్న ర్యాలీలో విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజా సంఘాలు, కార్మికులు పాల్గొనాలని కోరారు.

### బైక్‌ల చోరీపై ఫిర్యాదు

కాశీబుగ్గ: పలాస మండలం గరుడఖండి గ్రామంలో ఆర్.శివస్వరూప్, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మొగిలిపాడుకు చెందిన ఆర్.ప్రవీణ్‌లకు చెందిన పల్సర్ బైక్‌లను గురువారం దొంగలు ఎత్తుకుపోయారు. ఈ మేరకు బాధితులు శుక్రవారం కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. కాశీబుగ్గ సీఐ మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఇచ్ఛాపురం: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సమావేశంలో అభివృద్ధి పనులతో పాటు వివిధ అంశాలపై చర్చిస్తామని.. సభ్యులు విధిగా హాజరు కావాలని కోరారు.

### లింగ వివక్షతను నిర్మూలించాలి



అవగాహన ర్యాలీలో మహిళ సంఘాల సభ్యులు

వజ్రపుకొత్తూరు రూరల్: సమాజంలో ఉన్న లింగ వివక్షతను నిర్మూలించాలని వెలుగు ఏపీఎం గొడబ ప్రసాదరావు అన్నారు. ఒంకులూరులో శుక్రవారం జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగ వివక్షతను నిర్మూలిద్దాం.. హింసలను అరికట్టాలని, మహిళల అభివృద్ధికి సాకారం అందిద్దాం అంటూ నినాదాలు చేశారు. లింగ వివక్షత పట్ల ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీసీలు, వీఓఏలు, మహిళ సమైఖ్య సభ్యులు ఉన్నారు.